‘కంట్రోల్’ చేయడం లేదు!

నిరుపయోగం.. పోలీస్ సబ్ కంట్రోళ్లు

- నాడు దాతల సాయంతో ఏర్పాటు
- పట్టనట్టు వదిలేసిన పోలీసులు

తెనాలిరూరల్: నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి కావల్సిన సేవలు అందిస్తామంటూ పోలీసు అధికారులు ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సబ్ కంట్రోళ్లు (ఔట్ పోస్టులు) నిరుపయోగంగా ఉన్నాయి. 24 గంటలు సిబ్బంది అక్కడ విధులు నిర్వర్తిస్తారు గనుక నేరం జరిగితే వెంటనే స్పందించేందుకు వీలు ఉంటుందని వీటి ప్రారంభోత్సవాల సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు ఊదరగొట్టారు. దాతల విరాళాలతో నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, మైకులనూ వారి నుంచే తీసుకున్నారు. కేవలం అట్టహాసంగా వీటి ప్రారంభోత్సవాలను జరిపించి ఆనక వీటి గురించి పట్టించుకోవడమే మరిచారు. మార్కెట్‌లోని సబ్ కంట్రోల్ నిరుపయోగంగా ఉంది. చెత్త వేసేందుకు, రిక్షాలు, వాహనాలు నిలుపుకునేందుకు ఇనియోగిస్తున్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సబ్ కంట్రోల్‌ని తొలగించేశారు. ఇకపోతే మారిస్‌పేట రెండు గేట్ల మధ్య ఉన్న సబ్ కంట్రోల్‌ను తొలుత చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేశారు. పినపాడు, పాండురంగపేట ప్రాంతాలకూ అందుబాటులో ఉంటుందంటూ



మారీసుపేటలో అలంకారప్రాయంగా ఉన్న సబ్ కంట్రోల్

రెండు గేట్ల మధ్య ప్రాంతంలోకి మార్చారు. ఇక్కడి రైల్వే గేటు పడిందంటే వాహనాలు పెద్ద ఎత్తున నిలచిపోతాయి.

గతంలో కానిస్టేబుల్ ఇక్కడే ఉండి వాహన రాకపోకలను నియంత్రించే వారు. ప్రస్తుతం అదీ లేకుండా పోయింది. కేవలం పురపాలక సంఘ పారిశుద్ధ్య సిబ్బంది తమ పనిముట్లు, తోపుడు బండ్లను ఇక్కడ ఉంచుతున్నారు. సాధారణంగా సబ్ కంట్రోల్‌లో సిబ్బంది ఉంటారు. అయితే తెనాలిలో సబ్ కంట్రోళ్లు అన్నీ



నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌లోని పోలీస్ సబ్ కంట్రోల్

ఖాళీగానే ఉన్నాయి. రెండు గేట్ల మధ్య ఉన్న సబ్ కంట్రోల్‌లో ఇటీవల వరకు విద్యుత్ శాఖ బిల్లులు కట్టించుకునేవారు. రెండు గేట్ల మధ్య సబ్ కంట్రోల్ వద్ద రాత్రి గస్తీ సిబ్బంది బీట్‌ను వేస్తే మద్యం, గంజాయి తాగి తిరిగే పోకిరీల ఆగడాలకు కొంచెం కళ్లెం పడే అవకాశం ఉంది. మార్కెట్ వద్ద 24 గంటలూ మద్యం దొరుకుతుందన్నది జగమెరిగిన సత్యమే. ఇక్కడా సిబ్బందిని ఉంచితే నేరాలు కొంత వరకు అదుపు చేసినట్టవుతుంది. ఇప్పటికైనా సబ్‌కంట్రోళ్లలో సిబ్బందిని అందుబాటులో ఉంచితే నేరాలు తగ్గుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: టీ దుకాణం నిర్వహించే మహిళపై దాడి చేసి బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటకు చెందిన నాగిశెట్టి రాధ, జిలాని దంపతులు మార్కెట్ ఏరియాలో ప్రతిరోజు తెల్లవారు జామున దుకాణం నిర్వహిస్తుంటారు. బుధవారం దుకానం తెరచిన కొద్దిసేపటికే మారిస్‌పేటకే చెందిన షేక్ కమల్ వీరి బండి వద్దకు వచ్చి అద్దాలను పగులగొట్టి, రాధపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. మండలంలోని కొలకలూరుకు చెందిన విలేకరి నూతక్కి అచ్యుతాచారి మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అదే గ్రామానికి చెందిన పొన్నెకంటి రమేష్ వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు బుధవారం నమోదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్. ప్రతాప్‌కుమార్ తమ సిబ్బందితో బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 24 వేలు స్వాధీనపర్చుకున్నారు.

శ్రామికవర్గ మహారచయిత గోర్కీ వారసుడు ‘బొల్లిముంత’

పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బీవీ రావు

తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, అభ్యుదయ సినీరచయిత బొల్లిముంత శివరామకృష్ణ శ్రామికవర్గ మహారచయిత మాక్సిం గోర్కీ వారసుడని పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బీవీ రావు అన్నారు. గోర్కీ నవల ‘అమ్మ’తో ప్రభావితుడైన శివరామకృష్ణ, అభ్యుదయం ఆశయంగా, శ్రమజీవులు, పేద, బడుగువర్గాల చైతన్యం అజెండాగా ఎంచుకున్నారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలంగా ఉంటూనే ఆ భావజాల వ్యాప్తికి దోహదపడే రచనలను వివిధ ప్రక్రియల్లో చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతిని బుధవారం సాయంత్రం ఇక్కడి ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు బీవీ రావు అధ్యక్షత వహించారు. మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షుడు తోటకూర వెంకటరమణారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తర్వాత బొల్లిముంతకు సినిమా రంగం ఆహ్వానం పలికిందన్నారు. తనదైన వాడివేడి సంభాషణలతో అనేక సినిమాల విజయానికి ఆయన కారకులైనట్టు చెప్పారు. శారద, శోభన్ బాబు వంటి నటులు ఆ సినిమాలతోనే సినీరంగంలో స్థిరపడ్డారని వివరించారు. ‘అరసం’ జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెనహర్ తన ప్రసంగంలో తాను దేన్నయితే నమ్మారో దాన్ని త్రికరణశుద్ధిగా జీవితాంతం ఆచరించిన వ్యక్తి బొల్లిముంత శివరామకృష్ణ అని చెప్పారు. ఆయన రాసిన అందరూ బ్రతకాలి నాటకాన్ని రక్తకన్నీరు నాగభూషణం వంద ప్రదర్శనలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు లోకం భాస్కరరావు తన ప్రసంగంలో కమ్యూనిస్టు ఆదర్శాలతో జీవించటడమే బొల్లిముంతకు మనమిచ్చే నివాళిగా చెప్పారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి తమ ప్రసంగాల్లో బొల్లిముంతతో తమకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. ప్రజానాట్యమండలి అధ్యక్షుడు మాణిక్యాలరావు, కళాసమితి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. సభకు ముందు రంగిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. బెల్లంకొండ వెంకట్, అలపర్తి వెంకటేశ్వరరావు, నీలాంబరం, బెన్‌హర్, విజయ్‌లు అభ్యుదయ గేయాలను ఆలపించారు. సభానంతరం బొల్లిముంత రచన ‘సంభవామి యుగేయుగే’ నాటికను ప్రదర్శించారు.



బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్‌లో బుధవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవడంతో పాటు దానిని ఉపయోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటి దాని చెప్పారు. అర్హత ఉన్నవారు ఎప్పుడైన తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవచ్చని సూచించారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

రోడ్లపై ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: రోడ్లు, మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 28వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి వెళ్ళి వ్యర్థాలను సేకరించాలన్నారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతి, కౌన్సిలర్ యాతాటి అనిల్, డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్, పలువురు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాల్వలపై బండాలను తొలగించాలని సూచిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

ఇద్దరు విటుల అరెస్ట్

తెనాలిరూరల్: వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి వ్యభిచార నిర్వాహకుడు, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. ఇద్దరు మహిళలను సంరక్షణ కేంద్రానికి తరలించారు. పట్టణ నాజరుపేట కోకావారి వీధిలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగతుందన్న సమాచారంతో వన్ టౌన్ పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచార గృహ నిర్వాహకుడు దర్గారెడ్డితో పాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. ఇద్దరు మహిళలను సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది.

మున్సిపల్ అధికారుల మధ్య వివాదం

ఆరోగ్యాధికారిణిపై దురుసుగా ప్రవర్తించిన కమిషనర్

తెనాలిఅర్బన్: మున్సిపల్ అధికారుల మధ్య వివాదం జరిగిందనే ప్రచారం పట్టణంలో జరిగింది. ఆరోగ్యాధికారిణిపై మున్సిపల్ కమిషనర్ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణ కలకలం రేపింది. వివరాలోకి వెళ్ళితే కంపోస్టు యార్డును పరిశీలించేందుకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల వెళ్లారు. అక్కడ ఘన వ్యర్థాల నిర్వహణ విషయంలో అధికారుల అలసత్వాన్ని కమిషనర్ ప్రశ్నించే క్రమంలో ఆరోగ్యాధికారిణిపై దురుసుగా ప్రవర్తించినట్లు ప్రచారం జరిగింది. మున్సిపల్ అధికారిగా ఘన వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఎవరి పట్ల దురుసుగా వ్యవహరించలేదని చెప్పారు.

ఢీకొట్టి... ఆపై దౌర్జన్యం

తెనాలిరూరల్: ప్రైవేటు వైద్యశాల సిబ్బంది విలేకరిని ఢీ కొట్టడమే కాకుండా, అడిగిన వారిని చేతనైంది చేసుకోండంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన విలేకరి ప్రకాశరావు బుధవారం తెనాలి పాత ప్రైవేటు వైద్యశాల వద్ద బైక్‌పై వెళుతుండగా, వైద్యశాల ఆవరణ ఎదురు రోడ్డులో ఉండే ప్రైవేటు వైద్యశాల సిబ్బంది ఒకరు ఢీ కొట్టడంతో ఆయన కింద పడ్డాడు. సమీపంలోనే ఉన్న మరో జర్నలిస్టు గమనించి కిందపడిన ప్రకాశరావును లేపి జాగ్రత్తగా రావాలిగా అని వైద్యశాల సిబ్బందితో అన్నాడు. అయితే ఘటనకు కారకుడైన యువకుడు, ప్రైవేటు వైద్యశాల సిబ్బంది అందరూ కలసి విలేకరులపై దౌర్జన్యం చేయడమే కాకుండా ఏం చేస్తారో చేసుకోండని బెదిరింపులకు పాల్పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ మహిళా మంత్రి బంధువుల వైద్యశాల సిబ్బందే ఇలా దౌర్జన్యానికి పాల్పడుతున్నట్టు చెబుతున్నారు.

మంటలను అదుపులోకి తెస్తున్న అధికారులు



మోటార్‌లతో మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

తెనాలిఅర్బన్: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోకి కంపోస్టు యార్డులో తగలబడుతున్న వ్యర్థాలను అరిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మోటార్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా మంటలను అదుపులోకి తెస్తున్నారు. మంగళవారం సాక్షిదినపత్రిలో కంపోస్టు కష్టంతో ఉక్కిరిబిక్కిరి శీర్షికన వార్త ప్రచురణ అయిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తన సిబ్బందితో అక్కడకు వెళ్ళి మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. అలాగే వ్యర్థాల గుంటలను తొలగించేందుకు తీసుకువల్సిన చర్యలపై ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలతో చర్చించారు.

బలహీనమవుతున్న కాల్వ కట్టలు



రేపల్లె ప్రధాన మురుగుకాల్వ కట్టపై ఈదుపల్లి బ్రిడ్జి సమీపంలో జేసీబీ, ట్రాక్టర్లతో తరలిస్తున్న మట్టి



ఈదుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న మురుగు కాల్వ కట్టల మట్టి

- అక్రమంగా తరలుతున్న మురుగుకాల్వల కట్టల మట్టి
- పట్టించుకోని డ్రైనేజ్ అధికారులు

నగరం: అక్రమార్జనే లక్ష్యంగా టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఎక్కడ మట్టి అవసరమైనా మురుగు కాల్వల కట్టల మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో కాల్వ కట్టలు బలహీనమవుతున్నాయి. రేపల్లె ప్రధాన మురుగు కాల్వ(ఆర్ఎం డ్రైన్) న్యూ కోర్స్ కాల్వ కట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువవ్వడంతో కాల్వ కట్టలు బక్కచిక్కిపోతున్నాయి. ఈదుపల్లి వంతెన సమీపంలో మురుగుకాల్వ కట్టల మట్టిని తరలించుకోపోతున్నారు. పట్టపగలు కూడా కాల్వ కట్టల మట్టిని జేసీబీలతో తవ్వి ట్రాక్టర్‌లతో తరలిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటే డ్రైనేజ్ అధికారుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది అక్రమార్కులు రాత్రి సమయంలో ఎక్కడ పడితే అక్కడ కాల్వ కట్టల మట్టిని తరలించడంతో కట్టలు గుంతల మయంగా మారాయి.

కాల్వ కట్టల మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం

మురుగుకాల్వల కట్టల మట్టిని తరలిస్తే సహించేది లేదు. కట్టల మట్టిని తరలిస్తున్నారనే విషయం ఇప్పుడే దృష్టికి వచ్చింది. కాల్వ కట్టలపై గస్తీ ఏర్పాటు చేసి కట్టల మట్టి తరలకుండా చర్యలు చేపడతాం. – వీరయ్య, డ్రైనేజ్ డీఈ

ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్ల పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు

నిజాంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని పొందాలంటే ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్ చేయించుకోవాలని రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నం పోస్టాఫీసు, మండలంలోని వివిధ పోస్టల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్వహిస్తున్న ఆధార్ మ్యాపర్ క్యాంప్‌లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజల కోసం నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ క్యాంప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమీపంలోని పోస్టాఫీసులలో ఈ అనుసంధాన ప్రక్రియ జరుగుతుందని, లబ్ధిదారులు ఆధార్, ఫోన్ నంబరుతో పాటు తమ వివరాలను తెలియజేసి కేవలం రూ.200 చెల్లించాలన్నారు. నెఖారులోపు ఎన్‌పీసీఐ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్‌లు, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



రైతులు అప్రమత్తంగా ఉండాలి

గణపవరం(కర్లపాలెం): తుఫాన్ ప్రమాదం పొంచి ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.లక్ష్మి చెప్పారు. బుధవారం చింతాయపాలెం, గణపవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉన్నందున తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు చేపట్టవద్దని రైతులకు సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత కోతలు చేపట్టాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటా రూ.2,320కు, సాధారణ రకం రూ.2,300కు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మృతి



చుండూరు(వేమూరు): పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం అధ్యక్షులు ఈమని శ్రీనివాస్ రెడ్డి (80) గుండె పోటుతో మృతి చెందాడు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంలోని వలివేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాల ఉత్పత్తిదారు సహకారం సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. బుధవారం తెల్లవారుజామున గుండె పోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు తెనాలి విద్యార్థులు



తెనాలి: బీహార్ రాష్ట్రంలోని గయ పట్టణంలో ఈనెల 29-31 తేదీల్లో జరగనున్న 43వ సబ్ జూనియర్ జాతీయ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లకు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టులో 9వ తరగతి విద్యార్థి షేక్ హనీఫ్, బాలికల రాష్ట్ర జట్టులో 9వ తరగతి విద్యార్థిని పెనుమూడి బ్యూల ఎంపికయ్యారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్‌లు విద్యార్థులను అభినందించారు.

బాల్య వివాహాలు వద్దంటూ ర్యాలీ



తెనాలిరూరల్: బాల్య వివాహ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ ఏపీఎం కె. జయశ్రీ పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త్ భారత్‌లో భాగంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని మండలంలోని పెదరావూరు గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్, పారా లీగల్ వలంటీర్ చింతయ్య, మండల్ ఈగల్ సర్వీసెస్ కమిటీ సూపరింటెండెంట్ మహబూబ్ పాల్గొని బాలల హక్కులు, బాల్య వివాహాల గురించిన చట్టాలను వివరించారు. కె. రజని, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొని గ్రామంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



తెనాలిఅర్బన్: క్రీస్తు బోధనలు అనుసరణీయమని చిల్డ్రన్స్ యూత్ అధ్యక్షుడు గుండపోగు సాయిరామ్, టీడీపీ నాయకుడు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు. ఇందిరానగర్ కాలనీలో మంగళవారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు జనానికి గుర్తుగా నక్షత్రాన్ని అందరూ ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం చిల్డ్రన్స్ యూత్ ఏర్పాటు చేసిన భారీ స్టార్‌ను వారు ఆవిష్కరించారు. అలాగే కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేఆర్ అధ్యక్షుడు మేకల సురేష్, టీడీపీ పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు అత్తోట శరత్, చంద్ర వినయ్, సిద్దెల కమలాకర్, కాకర్లమూడి నవీన్, కాకర్లమూడి చిరంజీవి, విజయ్‌కుమార్, జమ్ము సతీష్, మంచాల మనోజ్, ఎస్.కె. ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి అష్టోత్తర కలశాభిషేకం



అమర్తలూరు (వేమూరు): మండలంలోని మోపర్రు గ్రామంలో వేం చేసి ఉన్న వేణుగోపాలస్వామికి కార్తిక మాసం పురస్కరించుకుని బుధవారం వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు బృందావనం వరదాచార్యులు పర్యవేక్షణలో ఉదయం సుప్రభాత సేవ అనంతరం విశ్వక్సేన ఆరాధన, కలశ పూజ, అఖండ దీపారాధన మండపారాధన, 108 కలశాల తీర్థజలంతో, పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారిని అలంకరించారు. సాయంత్రం పంచ హారతులు సమర్పించి కోటి దీపోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.